

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 6 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

తనపాదాలచెంత మోకరిల్లి నమస్కరించి ఆనందాశ్రువులు చెవులను నింపి జారిపోతుండగా తలలెత్తి తనముఖంలోకే చూస్తున్న దంపతులను చూశాడు సమర్థరాముడు. తనదూడలను చూస్తున్న కామధేనువులా సంతోషంగా చూస్తూ కనులతోనే పైకి లెమ్మన్నట్లు తల పంకించాడు. దంపతులు పైకిలేచారు. వినయంగా వంగిన శిరస్సులతో మిగిలినవారు కూడా పైకి లేవడంతో రంగురంగుల పూవులు ఒక్కసారిగా వికసించి తలలెత్తిన తోటలాగా మెరిసింది ప్రాంగణం.

అలవాటైన వనంలోకి తన గున్నలతో స్వేచ్ఛగా ప్రవేశించే ఐరావతంలాగా మందగమనంతో తనే ముందుగా అడుగులేశాడు ఆయన. సజ్జనుడిని అనుసరించే సద్గుణాలలాగా గుంపుగా ఆయనను అనుసరించారు అందరూ. ఎత్తైన మెట్లెక్కి దర్బారులావున్న విశాలమైన వసారాను దాటి, నేరుగా ఇంటి మధ్యభాగమును కూడా దాటి, లోపలికి సాగిపోయాడు సమర్థరాముడు. కొందరు ఏనుగులు చెక్కిన మెట్లవద్దనే ఆగిపోయారు. కొందరు సింహద్వారమువద్ద ఆగిపోయారు. భక్తుడి గుండెలలోకి భగవంతుడిలాగా, పవిత్రమైన మనసులోకి సదాశయములాగా అలవాటుగా అన్నట్లు నేరుగా

ఈశాన్యభాగములోని పూజాగృహములోకి ప్రవేశించాడు ఆయన. దంపతులు, ఆయన ప్రధాన శిష్యుడు ఐన ఉద్ధవుడు లోపలి వెళ్ళారు. మిగిలిన శిష్యులు పూజాగృహ ద్వారం వద్ద ఆగిపోయారు.

పూజాగృహంలో వాయవ్యభాగంలో ఉన్నది పూజామందిరం. ఉన్నతమైన వేదికమీద దంతపు కోళ్ళపాదములతో, ఎఱ్రచందనపు చెక్కతో దిద్దిన నగిషీలతో గదికి సగంపైగా ఎత్తుకు గంభీరంగా ఉన్నది ఆ మందిరం. మందిరం ముందు జింకచర్మం పరచిన పీఠము ఉన్నది. దానిపై ఆసీనుడైనాడు సమర్థరాముడు.

నిలువెత్తు తుల్జాపూరు భవానీతైలవర్ణ చిత్రం దివ్యంగా పూలమాలలతో అలంకరింపబడి ఉన్నది మందిరంలో. తళతళలాడుతున్న పూజాపరికరాలు, పూజాద్రవ్యాల మధ్యన చిన్న వెండి సింహాసనము మీద మూడు అంగుళాల పరిమాణంలో ఉన్న అమ్మవారి వెండిప్రతిమ కాశ్మీర కుంకుమలో కంఠము వరకు మునిగిపోయి ఉన్నది. దివ్యసుందరమైన మందహాసప్రభలను వెలువరిస్తున్న ముఖము మాత్రమే పైకి కనిపిస్తున్నది. అగరు పొగల పరిమళములు, ఆధ్యాత్మిక ప్రకంపనలు అలౌకికమైన పారవశ్యాన్ని కలిగిస్తున్నాయి ఆ పూజాగృహంలో.

కామాక్షి పాదాలచెంత ఆదిశంకరునిలా, భువనేశ్వరి పాదాలచెంత విద్యారణ్య యతీశ్వరునిలా, తుల్జాపూరు భవానీ మందిరములో కూర్చున్నట్లు, అర్థనిమీలిత నేత్రాలతో కొద్దిసేపు వెలుపలా, హృదయములో ఉన్న అమ్మను పరామర్శిస్తున్నట్లు, విన్నపం చేస్తున్నట్లు కూర్చున్నాడు సమర్థ రాముడు. అంతరంగానికి అందిన ఏదో సూచనను పరిశీలిస్తున్నట్లు అందంగా కొద్దిగా ముడిపడింది ఆయన భ్రుకుటి. ఆనందకారకమైన బోధకు హాయికలిగినట్లుగా అరవిరిసింది దరహాసం. రెండు దేవపారిజాత కుసుమాలు ఒకేసారి రేకులు విప్పుకున్నట్లు కనులు తెరిచి కృష్ణరాయలను చూశాడు ఆశీస్సులందిస్తున్నట్లు. సూటిగా రెప్పవాల్చకుండా కనులు అనే గవాక్షాలనుండి హృదయ మందిరంలోకి చూస్తున్నట్లు శోధిస్తున్నట్లు చూశాడు కొద్దిసేపు.

కృష్ణరాయల మనసులో అనేకభావాలు అలలలాగా చెలరేగుతున్నాయి. సమర్థ రామదాసు వారిని చూసిన దగ్గరినుండీ రాయల మనసు తను పుట్టి పెరిగిన మాతృభూమి చుట్టూనే తిరుగుతున్నది. ఆ కళ్యాణ దుర్గం, ఆ ప్రతాప దుర్గం, ఆ సజ్జన్ గఢ్ కనులముందు మెదులుతున్నాయి. మనసులో ఏదో దిగులు ఆవరించుకున్నట్టు బరువెక్కింది గుండె. అంతలోనే రెండురోజులక్రితం జరిగిన సంఘటన మరలా తరుముకొచ్చింది మనసులోకి.

‘ అఖండ భారతమంతా అయోధ్య కాదూ! ఎక్కడున్నా రఘువీర సమర్థుడి నీడలోనే ఉన్నావు కృష్ణా బా ’, రాయల మనసును చదివినట్టుగా లాలనగా పలికాడు సమర్థరాముడు. ‘ కృష్ణా బా! నువ్వు రామకార్యం కోసం ఇక్కడికి వచ్చావు’ అన్నాడు. మరొక విషయము కొంతకాలంగా వేధిస్తున్నది కృష్ణరాయలను. అటు మరాఠాలకు యిటు హైదరాబాదు నవాబులకు సరిహద్దుపరగణాగా ఊగిసలాడుతున్నది ఆ ప్రాంతం కొంతకాలంగా. తన తండ్రి ఛత్రపతి గొడుగు నీడన మనసుకు ఊరటగా ప్రశాంతంగా సతోషంగా జీవికను గడిపాడు. ఆయన గతించిన తర్వాత తన హయాములో హైదరాబాద్ నవాబులకు విధేయత ప్రకటించవలసిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నవాబుల మన్నన బాగానే ఉన్నది కానీ మనసు పుట్టింటికి మరలుతున్నది మధ్య మధ్య.

‘ ఇప్పుడు జరుగుతున్న ప్రతిదీ ఇంతకుముందు జరిగినదానికి కొనసాగింపే! ముందు జరుగబోయే దానికి ప్రారంభమే ’ అని మరలా కొద్దిసేపు కనులు మూసుకుని ఆలోచిస్తూ ఉండిపోయాడు సమర్థరాముడు. ఆ గదిలో ఆయనకాక ఆ దంపతులు, ఆయన ప్రధాన శిష్యుడు ఐన ఉద్ధవుడు ఉన్నారు. అకస్మాత్తుగా గదిలో గాలిలో, ఆ ఉనికిలో ఏదో విద్యుత్తు ప్రసరించినట్టు అనిపించింది ముగ్గురికీ. ఉద్ధవునికి యిది మామూలే. దంపతులు ఒక అనిర్వచనీయమైన అనుభూతికి లోనైనారు. లక్ష్మిబాయి కూర్చున్నది కూర్చున్నట్టే బాహ్యస్మృతి కోల్పోయింది.

యిది స్వప్నమా, నిజమా, నాకేమైనా భ్రాంతి కలుగుతున్నదా అని అనుకున్నాడు రాయలు. ఆయనకు ఎదురుగా మూడు అడుగుల దూరములో పద్మాసనములో కూర్చున్న సమర్థ రామదాసువారి స్థానములో ఒక దివ్య జ్యోతిని చూశాడు రాయలు. వేరే ఏదీ కనిపించడంలేదు.

కనులకు మిరుమిట్లు గొల్పుతున్న ఆ తేజోరాశి మధ్యములో ఒక దివ్య కపి మూర్తి కనిపించీ కనిపించనట్టుగా, మంచుపరదాల మాటునుండి సూర్యబింబములా కనిపించింది. ఊర్ధ్వ పుండ్రములను ధరించి ఉన్నది. చెవులకు దివ్యమైన కుండలములను ధరించి ఉన్నది. పండిన మామిడిలా ఉన్నది. ఉబికిన రెండు దవడలు కలిగిఉన్నది. రెండు చేతులనూ ధ్యానముద్రలో బంధించి ఉన్నది. దివ్య మంత్రమును మననము చేస్తున్నది. ఆ కనుల వెంట చెమ్మ కనబడుతున్నది.

సన్నని వణుకు ప్రారంభము ఐంది రాయల శరీరములో. అది భయముతో కలిగిన కంపము కాదు. మందమలయపవనానికి మందారము ఊగినట్టు, పట్టరాని ఆనందము కలిగినప్పుడు గగుర్పాటుతో హాయిగా, తీయగా, తిమ్మిరిగా శరీరమంతా పులకలు రేగినట్టు అనిపించింది. శరీరములో ఏదో తెలియని ఒక తెమ్మెర గాలిలోకి తేలుతున్నట్టు అనిపించింది. కలలో చూసినట్లు తన శరీరము తనకే వేరే వ్యక్తిని చూసినట్లు విడిగా విభిన్నముగా కనిపిస్తున్నది. క్రమక్రమంగా తనకు బాహ్యస్మృతి తొలిగిపోతున్నట్టు తెలుస్తున్నది. ఇప్పుడిక ఏ దృశ్యమూ లేదు, ఏదో మధురమైన అనుభూతి మాత్రమే ఉన్నది. ఏదో ఒక నాదం వినిపిస్తున్నది.

# 7

రాం!

ఆ దివ్యమైన నాదం మొదలు కాగానే ఉద్ధవుడు సమర్థరాముడికి నమస్కరించి, ప్రక్కనే పరిచి ఉన్న జింకచర్మముపై పద్మాసనములో ధ్యానముద్రలో మననం మొదలుబెట్టాడు. 'రాం.. రాం.. రాం..' అని నాదం వెలువడడం ప్రారంభం కాగానే కృష్ణరాయలకు కొద్దిగా బాహ్యప్రపంచం తెలియడం ప్రారంభం ఐంది. అయితే అది మెలకువా కాదు, స్వప్నమూ కాదు, రెండిటికి మధ్య దశ! చెవులకు ఆ నాదము మాత్రమే వినిపిస్తున్నది. కంటికి ఆ నాదం వెలువరిస్తున్న మూర్తి తాలూకు దృశ్యము మాత్రమే కనిపిస్తున్నది. మిగిలిన ప్రపంచమంతా ఏమీ లేదు ఆయనకు ప్రస్తుతం.

ఎదురుగా సమర్థరాముడు పద్మాసనంలో కూర్చుని ఉన్న అనుభూతి మాత్రమే కానీ, ఆయన చుట్టూ ఒక దివ్యమైన అగ్నిప్రభ గోళాకారంలో వెలుగుతున్నది. ఆ వెలుతురుబంతి మధ్యలో ఆయన శరీరంచుట్టూ కించిత్తు నీలిరంగును కలిగిన అగ్నిప్రభలగోళం. దానికి వెలుపల పసుపూ ఎరుపూ కలిసిన సిందూరవర్ణపు కాంతిగోళం. దానికి వెలుపల కణకణమండే కాల్చిన బంగారపు వర్ణంలో ఎర్రని అగ్నిప్రభల గోళం కనిపిస్తున్నాయి. ఏడు నాలుకలు సాచి స్వచ్ఛముగా, ఉజ్జ్వలముగా ప్రజ్జ్వరిల్లే యజ్ఞవేదికలో అగ్ని వెలువరిస్తున్న'చిర చిర' మనే ధ్వనులు వినిపిస్తున్నాయి. విచిత్రం! మధ్యలో 'హిస్ .. హిస్సు'మని ఏదో అనంత ప్రమాణమైన మహాదివ్య సర్పము చేస్తున్న బుసవినిపిస్తున్నది. అంతలోనే ఆ అగ్నిధ్వనులు, బుసబుసలూ ఒకదానిలో ఒకటి లయమైపోతున్నాయి. మరలా ఒకదానివెంట ఒకటి వినిపిస్తున్నాయి.

యాగశాలలో హోమగుండము చుట్టూ ఉన్నట్లు ఆ గదిలో ఉన్న వస్తువులు అగ్నిప్రభలతో మెరిసిపోతున్నాయి. కృష్ణరాయలు, లక్ష్మీబాయి దంపతుల దేహములమీద ఆ కాంతులు ప్రతిఫలిస్తున్నాయి, అగ్నిలో పవిత్రులను చేస్తున్నట్లు! 'రాం' అన్న శ్రీరామ ఏకాక్షర మహామంత్రం అది. 'ర్' అనే అగ్నిబీజము, 'ఆ' అను ' ఆదిశేషుని బీజము' లకు 'సున్నా'ను చేర్చిన శ్రీరామ మహామంత్రం. మంత్రములలో కల్పవృక్షమువంటిది. చింతామణి వంటిది. హనుమంతుడు నిరంతరమూ మననము చేసే మహామంత్ర రాజము అది.

' ఓం భద్రం కర్ణేభి శృణుయామ దేవాః..' అనే శాంతిమంత్రమును ఉచ్చరించడం మొదలుబెట్టాడు ఉద్ధవుడు. క్రమక్రమంగా ఒకదివ్య ప్రణవనాదములో అర్థమాత్రవలె 'రాం.. రాం' అనే ధ్వని తనలో తానే లీనమైనట్టు నెమ్మదిగా ఉపశమించింది. దివ్యమైన ధ్వని తరంగాలు సృష్టించిన ప్రకంపనలు తెలుస్తున్నాయి. కొంతసేపటికి ధ్వనులతోపాటు అగ్నికాంతులు కూడా ఉపశమించాయి. ప్రకాశవంతమైన వెలుతురు గదినిండా పరుచుకున్నది. అదే కాంతి తన మదినిండా పరుచుకున్న హాయిని అనుభవిస్తున్నాడు కృష్ణరాయలు. బయట దూరంగా వ్యాపించి ఉన్న వనంలో పక్షుల కిలకిలారావాలు, వాటి రెక్కల చప్పుడు వినిపిస్తున్నది. చల్లని గాలి గవాక్షంగుండా శరీరాలకు సోకుతున్నది. మాటలలో వర్ణింప శక్యంకాని ఆనందం మనసునిండా అలుముకున్నది కృష్ణరాయలకు.

నెమ్మదిగా కనులుతెరిచి కృష్ణరాయలను పరిశీలనగా చూశాడు సమర్థరాముడు. సంతృప్తి చెందినట్టు విరిసీ విరియని చిరునగవు విరిసింది ఆయనముఖంలో. కొద్దిగా తలను ప్రక్కకు తిప్పి ఉద్ధవుడిని చూశాడు. ఉద్ధవుడు లేచి నమస్కరించి గది వెలుపలకు వెళ్ళాడు. రెండు తలుపులను దగ్గరికి చేర్చి చేతులు కట్టుకుని నిలబడిపోయాడు ద్వారపాలకుడిలాగా.

తలుపులుమూసుకున్న తరువాత కృష్ణరాయలకు అభిముఖంగా తిరిగాడు సమర్థరాముడు. తీరానికి చేరుస్తున్న పడవలా నెమ్మదిగా తన కుడిపాదమును లేపి కాలి పెద్దవేలును కృష్ణరాయల నుదురుకు తాకించి అలాగే అదిమిపెట్టాడు నిశ్చలంగా. కనురెప్పపాటులో అర్థవంతు కాలంపాటు అనంతమైన విద్యుత్తు సోకినట్టు చలించిపోయింది కృష్ణరాయల దేహం. ఆ తర్వాత నిటారుగా నిశ్చలంగా బిగిసినట్లు అనిపించింది. వెన్నుపూస చివరన మొదలై నాభికి దిగువన, నాభికి పైభాగములో, విశాలమైన ఛాతీ మధ్యభాగములో, కంఠస్థానంలో, రెండు కనుబొమల మధ్యలో, నడినెత్తిన ఏదో మెరుపు మెరుస్తున్నట్లు, చర చరా పాకుతూ వెళ్ళిన అనుభూతి కలిగింది. ఒక్కొక్క స్థానంలో ఒక నీటిబుడగ విచ్చుకున్నట్లు చిరుధ్వని కలిగిన అనుభూతిని పొందాడు కృష్ణరాయలు. బాహ్యస్మృతి ఎంతమాత్రమూ తెలియని స్థితిలో తన శరీరములో స్పందనలను మాత్రం గ్రహిస్తున్నాడు కృష్ణరాయలు. మాడుమీద మంచుకురిసిన అనుభూతి కలిగింది. ఒక దివ్యమైన చల్లదనం మాత్రమే తెలుస్తున్నది. ఒళ్లంతా పులకించినట్టు, తిమ్మిరిగా, హాయిగా పరవశం కలిగింది. ఆ అనుభూతి తప్ప లోపలా, బయటా ఏమీ తెలియని మత్తులో మునిగిపోయింది ఆయన దేహం.

జయ జయ రఘువీర సమర్థా! అని మంద్రస్వరంలో ఉచ్చరిస్తూ తన కుడిచేతితో కృష్ణరాయల వక్షస్థలం మీద మృదువుగా తడిమాడు సమర్థ రాముడు. ఒక చల్లని తెమ్మెర వీచినట్లు అనుభూతి చెందుతూ మెల్లగా కనులు తెరిచాడు కృష్ణరాయలు. ఎదురుగా ప్రేమగా పసిబిడ్డను చూస్తున్నట్లు సమర్థ రాముడు కనిపించాడు. తన ప్రక్కన ఏదో అలౌకికమైన ప్రపంచంలోకి తొంగిచూస్తున్నట్లు అరమోడ్పు కన్నులతో భార్య కనిపించింది. నెమ్మదిగా జరుపుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు కదులుతున్న వక్షస్థలం తప్ప ఏ చలనమూ లేకుండా, ఎవరో శిల్పి చెక్కిన అందమైన సజీవ శిల్పంలా ఉంది ఆమె. ప్రశ్నార్థకంగా చూస్తున్న కృష్ణరాయలకు తన కనులతోనే సూచన చేశాడు సమర్థరాముడు. భార్య భుజం మీద మృదువుగా తట్టడంతోనే ఆమె కన్నులు తెరిచింది. ఏదో అడగాలని నోరు తెరిచిన కృష్ణరాయలను చూపులతోనే వారించాడు సమర్థరాముడు. దగ్గరకు చేరవేసిన తలుపులను తెరుచుకుని ఉద్ధవుడు లోపలకు వచ్చాడు.

గురువుగారి చూపులు అనే గ్రంథాన్ని చదివినవాడిలా గదిబయటకు వెళ్ళాడు, మూడు నిముషాల అనంతరం లోపలి వచ్చాడు, ఆతనితో పాటు మరొక ప్రధాన శిష్యుడు లోపలకు వచ్చాడు, ఆయన కళ్యాణ్ స్వామి. ఆయన భుజానికి బరువైన సంచీ వ్రేలాడుతున్నది. చంకలో పొడవాటి చేతికర్ర ఉన్నది, అది సమర్థ రాముడు ఉపయోగించే చేతికర్ర.

లోపలకు వచ్చి గురువుకు వందనంచేసి ఆయనకు అభిముఖంగా కూర్చుని భుజానికున్న సంచిని తెరిచి మడతలు పెట్టిన జింకచర్మాన్ని తీసి నేలపై పరిచి, సంచిలోని పరికరాలను జింకచర్మం మీద ఒకటొకటీ క్రమపద్ధతిలో సర్దాడు. దంతంతో చేసిన నగిషీలు చెక్కిన భరిణె వంటి పాత్ర ఉన్నది, అదులో చిక్కని నల్లని ద్రవం ఉన్నది. ఇంద్రధనుస్సులను కట్టగట్టినట్లు అందంగా రంగు రంగులలో మెరిసిపోతున్న నెమలి ఈకల కట్ట ఉన్నది.

లీలగా సుగంధాలను వెలువరిస్తున్నాయి ఆ నెమలీకలు. చివరిగా కాషాయరంగు పట్టుబట్టలో భద్రంగా చుట్టి పెట్టిన ఒక గ్రంథాన్ని బయటకు తీశాడు, జాగ్రత్తగా పొదివిపట్టుకుని జలతారు ముడుల కుచ్చులు విడదీసి, చేతులలో ఉంచుకుని సమర్థరాముడి వైపు చూశాడు.

ఆ గ్రంథాన్ని తన చేతులలోకి తీసుకుని భక్తిగా కనులకు అద్దుకుని ఆ గ్రంథము మధ్యనుండి ఒక దొంతరను బయటకు తీసి, మిగిలిన గ్రంథాన్ని తనముందున్న పీఠంపై పెట్టి తన చేతిలోని దొంతరను తెరిచాడు సమర్థ రాముడు, ఆ గ్రంథము ' ఆంధ్ర మహాభాగవతము, బమ్మెర పోతనార్య ప్రణీతము, ఆ దొంతర సప్తమ స్కంధము!

' ఆంధ్రులు ఎంతటి భాగ్యవంతులు క్రిష్ణోబా! యిది పుణ్యపేటి ' అని తన చేతిలోని దొంతరను కనులకు అద్దుకుని దానిని తెరిచాడు. ఒక నిముషం కనులు మూసుకుని ఆనందాన్ని మౌనంగా అనుభవిస్తున్నట్లు ఉండిపోయాడు. గ్రంథాన్ని తెరిచి, మధురమైన కంఠంతో, వింటున్న వారి చెవులను పాత్రలుగా చేసి అమృతాన్ని వొంపుతున్నట్లు పఠనం మొదలెట్టాడు, అది పఠనం కాదు, గానం!

'తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్...' అంటూ మైమరచి పద్యాన్ని పూర్తిచేశాడు. ఆయన కనులవెంట చెమ్మ! 'కృష్ణోబా! సంస్కృతంలో వ్రాసి తనివితీరక ఆంధ్రంలో వ్రాసి మురిసిపోవడానికి వ్యాసుడే యిలా పుట్టాడు' అన్నాడు.

కృష్ణరాయలకు ఏమీ ఆశ్చర్యం కలుగలేదు. ఉత్తర దక్షిణ భారత భాషలు అన్నీ చదవడం, అర్థం చేసుకోవడం, వ్రాయడం మాత్రమే కాదు, ఆయా భాషలలో అద్భుతమైన కవిత్వాన్ని చెప్పిన మహానుభావుడు సమర్థ రాముడు అని తెలుసు ఆయనకు. ఆంధ్ర భాగవతాన్ని అలా అపురూపమైన సంపదను జాగ్రత్తగా వెంట తీసుకువెళ్ళినట్లు తనతో వెంట తీసుకుని తిరగడం కొద్దిగా అబ్బురంగా అనిపించింది మనసులో. 'పఠించావా కృష్ణోబా?' అని అడిగాడు, గ్రంథాన్ని చూపిస్తూ. లేదు అన్నట్లు తలను పంకించాడు కృష్ణరాయలు. 'పఠించు, లేదు అంటే ఇక్కడ పుట్టినందుకు పట్టిన అదృష్టాన్ని కాలరాసుకున్నట్లే' అని ఒక నిముషం ఆగి, ' యిదీ గ్రంథం అంటే, జేణే పరమార్థ్ వాఢే అంగీ అనుతాప చఢే భక్తీ సార్ధ ఆవడే త్యా నావ గ్రంథ్! పరమార్థవృద్ధి చేసేది, మనసులో అనుతాపమును వృద్ధి చేసేది, భక్తి పట్ల అనురాగాన్ని పెంచేదీ అదే నిజమైన గ్రంథం కృష్ణోబా' అన్నాడు. కొంత తడవు మౌనం వహించి మరలా ' అంతఃకరణం పరిశుద్ధం అవుతుంది కృష్ణోబా' అన్నాడు.

ఆయన కంఠం నుండి మధురమైన ఒక పలుకు ఒక బోధనలా, నినాదంలా వెలువడింది. కళ్యాణ్ వెంటనే తనవెంట లోనికి తెచ్చిన సమర్థరాముడి చేతికర్రను తీసుకుని, చేతి పిడివద్ద పట్టుకుని తిప్పాడు. అది మూతలా ఊడి వచ్చింది. ఆ కర్ర లోపల అంతా డొల్లగా ఉంది. అందులో దొంతర దొంతరలుగా మెరిసిపోతున్న పాము కుబుసంలాంటి పలుచని పట్టు వస్త్రాలున్నాయి. ఒక వస్త్రాన్ని పీఠంపై ఉంచి నెమలి ఈకను తీసుకుని, దంతపు భరిణెలో ముంచి సమర్థ రాముడు చెప్తున్న దానిని వ్రాయడం మొదలెట్టాడు.

'నవమీ భక్తి ఆత్మ నివేదన్
నహోతానచుకే జన్మ మరణ్
హే వచన సత్య ప్రమాణ్
అన్యథా నవ్హే '

కృష్ణరాయల మనసు సంబరంతో అంబరాన్ని అంటినట్లు ఎగిసిపడింది. ఒళ్ళు పులకించిపోతుండగా చేతులు జోడించి మరాఠీలో అన్నాడు, ' నేనెంత భాగ్యవంతుడిని! దాసబోధతో నా మహలు పావనం అయ్యింది స్వామీ' అన్నాడు, ఆనందంతో ఆయన గొంతు పూడుకుపోయింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS